క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



రోడ్డు ప్రమాదంలో గాయపడిన శ్రీనివాసరావు

కొయ్యలగూడెం: ఆరిపాటి సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. జగ్గన్నపేటకు చెందిన ఎ.శ్రీనివాసరావును బైక్‌పై వెళుతుండగా పోతవరం వైపు వెళుతున్న ఓ వ్యాన్ వెనుక నుంచి ఢీ కొంది. దీంతో అతడి కుడి కాలుకు తీవ్ర గాయమైంది. దీంతో చికిత్స నిమిత్తం 108 వాహనంలో కొయ్యలగూడెం ప్రైవేట్ ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్సకు విజయవాడ తరలించినట్లు పోలీసులు తెలిపారు.

బాదంపూడిలో ఇళ్ల తొలగింపు



ఇళ్లను కూల్చుతున్న పొక్లెయిన్

ఉంగుటూరు: బాదంపూడి గ్రామంలో ఇరిగేషన్ కాల్వ గట్లపై ఉన్న ఎనిమిదిళ్లలో ఐదిళ్లను గురువారం తొలగించారు. ఎంపీడీఓ రాజమనోజ్ పర్యవేక్షణలో ఈవోపీఆర్డీ చంద్రశేఖర్, ఈఓ రవికుమార్‌లు పొక్లెయిన్ల సాయంతో ఇళ్లను తొలగించారు.

విష్ణు ఆలయంలో దీపారాధన



స్వామివారికి దీపారాధన చేస్తున్న యువత

దెందులూరు : ధనుర్మాస పూజల్లో భాగంగా స్థానిక విష్ణు ఆలయంలో గురువారం మహిళలు స్వామివారికి వివిధ రకాల పుష్పాలతో విశిష్ట అలంకరణ చేశారు. దీపారాధన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు భక్తులకు స్వామివారి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

నేడు సోషల్ ఆడిట్ గ్రామ సభలు

దెందులూరు: మండలంలోని మూడు గ్రామాల్లో శుక్రవారం జాతీయ ఉపాధి హామీ పథకం గ్రామ స్థాయి సోషల్ ఆడిట్ సభలు నిర్వహించనున్నట్లు ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్లు ఫాతిమా శ్రావణ్ తెలిపారు. ఉదయం 10 గంటలకు జోగన్నపాలెం, 12 గంటలకు సానిగూడెం, మధ్యాహ్నం 2 గంటలకు శ్రీరామవరంలో సభలు నిర్వహిస్తామని, ప్రజలు హాజరుకావాలని కోరారు.

ఏజెన్సీ భూ సమస్యలపై వినతి



డీఆర్వోకి వినతిపత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

ఏలూరు (టూటౌన్): ఏజెన్సీ భూ సమస్యలు పరిష్కరించాలని, రెవెన్యూ అధికారుల తప్పుడు ప్రొటెక్షన్ ఆర్డర్లపై సమగ్ర విచారణ చేయించాలని, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ సీపీఎం జిల్లా కమిటీ బృందం గురువారం డీఆర్‌ఓ విశ్వేశ్వరరావుకు వినతి పత్రం అందజేసింది. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ గిరిజన చట్టాలకు లోబడి రెవెన్యూ శాఖ అధికారులు భూ సమస్యలను పరిష్కరించాలని కోరారు. గిరిజనులు తమ భూములు, హక్కుల కోసం చేస్తున్న పోరాటాలపై కొందరు పోలీసు అధికారులు, గిరిజనేతరులతో కుమ్మక్కై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. బుట్టాయగూడెం, జీలుగుమిల్లి మండలంలోని పలు గ్రామాల్లో కోర్టు ఆర్డర్లున్నా గిరిజనులపై అక్రమ కేసులు పెట్టిన సందర్భాలు అనేకం ఉన్నట్టు చెప్పారు. గిరిజనుల సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని డీఆర్‌ఓకి అందించారు. కార్యక్రమంలో సీపీఎం కార్యదర్శి వర్గసభ్యుడు పి.రామకృష్ణ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల ధర్నాలు

ఏలూరు (టూటౌన్): మున్సిపల్ కార్మికులకు తక్షణమే 12వ పీఆర్సీ ప్రకటించాలని, మధ్యంతర భృతి (ఐఆర్) ఇవ్వాలని, గతేడాది సమ్మె కాలపు ఒప్పందాలు అమలకు జీఓలు ఇవ్వాలని, ఇంజినీరింగ్ కార్మికుల జీతాలు పెంపుదల చేయాలని కోరుతూ గురువారం మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులు ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలోని వివిధ శానిటరీ సర్కిళ్లలో ధర్నాలు నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు బి.సోమయ్య, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర అధ్యక్షుడు లావేటి కృష్ణారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.జాన్‌బాబు, ఆటో డ్రైవర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.గోపీలు పాల్గొని మాట్లాడారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాల్సిందే..

- నేడు సబ్‌స్టేషన్ల వద్ద ఆందోళన
- వైఎస్సార్‌సీపీ పోరుబాటను విజయవంతం చేయాలి
- కూటమి మోసాలకు ప్రజలే బుద్ధి చెబుతారు

బుట్టాయగూడెం: విద్యుత్ చార్జీల పెంపుపై వైఎస్సార్‌సీపీ పోరుబాట పట్టింది. దీనిలో భాగంగా విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టేందుకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సిద్ధమయ్యారు. ఎన్నికలకు ముందు విద్యుత్ చార్జీలు పెంచమని ప్రజలకు హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం మాట తప్పి విద్యుత్ చార్జీలను పెంచి ప్రజలపై పెను భారం మోపింది. గడచిన ఆరున్నర నెలల్లో రెండు సార్లు కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలను పెంచడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనితో వైఎస్సార్‌సీపీ ప్రజల పక్షాన వారిని భాగస్వాములను చేస్తూ పెంచిన విద్యుత్ చార్జీలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున ర్యాలీలు, నిరసన కార్యక్రమాలు చేయనున్నారు. పోలవరం నియోజకవర్గంలోనే బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, పోలవరం, వేలేరుపాడు, కుక్కునూరు మండలాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు కొయ్యలగూడెం మండలానికి చేరుకుంటారు. కొయ్యలగూడెం నుంచి ఏడీ కార్యాలయం వరకూ భారీ ర్యాలీ చేయడంతోపాటు అక్కడ పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ ఏడీ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేయనున్నారు.

పోరుబాటతో ప్రభుత్వం కళ్లు తెరిపించాలి

లింగపాలెం: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి ప్రజలపై పన్నుల బాదుడు కార్యక్రమాన్ని కొనసాగిస్తున్న కూటమి ప్రభుత్వ కళ్లు తెరిపించాలని చింతలపూడి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కంభం విజయరాజు అన్నారు. గురువారం లింగపాలెంలో వైఎస్సార్‌సీపీ నేత బీవీఎస్ రెడ్డి గెస్ట్‌హౌస్ వద్ద జరిగిన వైసీపీ ముఖ్య నేతల సమావేశంలో విజయరాజు పాల్గొని మాట్లాడుతూ శుక్రవారం వైఎస్సార్‌సీపీ అధినేత మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించనున్న పోరుబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజయరాజు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విజయరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఓటు వేసిన ప్రజలను దగా చేస్తుందని అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే ప్రజల నడ్డి విరిగేలా పన్నులు వేసి బాదుడు కార్యక్రమాన్ని ప్రారంభించిందన్నారు.



చింతలపూడి విద్యుత్ కార్యాలయం(ఇన్‌సెట్‌లో) లింగపాలెం: మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నియోజక వర్గ ఇన్‌చార్జి కె.విజయరాజు

చంద్రబాబు మోసాలపై వైఎస్సార్‌సీపీ ప్రజల పక్షాన ఆందోళన చేపడుతుందన్నారు. ఈ నెల 27వ తేదీ ఉదయం పది గంటలకు చింతలపూడి పాత బస్టాండ్ ఆవరణ నుంచి విద్యుత్ శాఖ డీఈ కార్యాలయం వరకు ప్రదర్శనగా వెళ్లి అధికారులకు వినతిపత్రం అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు భీమిరెడ్డి వెంకట సూరారెడ్డి, మండల అధ్యక్షులు కొఠారి మోహన్, లిడ్ క్యాప్ మాజీ డైరెక్టర్ సొంగా సందీప్, వైసీపీ నాయకులు బి.ప్రసాదరెడ్డి, నూతుల పాటి శ్రీను, బేతిన మధు, పి.ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

కరెంట్ చార్జీల మోత

చింతలపూడి: కూటమి నేతల మాటలకు, చేతలకు పొంతన లేకుండా పోతుంది. ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడవక ముందే కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలను భారీగా పెంచి ప్రజల నడ్డి విరిచింది. ఇటీవల వస్తున్న విద్యుత్ బిల్లుల షాక్‌తో వినియోగదారులు విలవిల్లాడుతున్నారు. పూరి పాకలకు, పెంకుటిళ్లకు పెరిగిన బిల్లులు వస్తుండటంతో జనం బెంబేలెత్తుతున్నారు. గత నెల బిల్లులతో పోలిస్తే ఈ నెలలో మూడింతలు పెరిగాయని వినియోగదారులు వాపోతున్నారు. దీంతో సామాన్య, మధ్య తరగతి కుటుంబాలకు విద్యుత్ బిల్లులు మోయలేని భారంగా మారాయి. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానం మేరకు విద్యుత్ బిల్లులు తగ్గించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం ప్రతిపక్షంలో ఒకలా, అధికార పక్షంలో మరోలా వ్యవహరిస్తుందని ప్రజలు బాహాటంగానే విమర్శిస్తున్నారు.

పెంచిన చార్జీలు వెంటనే తగ్గించాలి



నాకు ఇంట్లో కేవలం ఒక ట్యూబ్ లైట్ ఒక ఫ్యాన్ మాత్రమే ఉంది. గతంలో నాకు కరెంట్ బిల్లు రూ.60 మాత్రమే వచ్చేది. ఇప్పుడు రూ.225 కరెంట్ బిల్లు వచ్చింది. ఈ ప్రభుత్వంలో విద్యుత్ చార్జీలు పెంచడం వల్ల నాపై ఆర్థిక భారం పడింది. నాకున్న ఒక్క ట్యూబ్‌లైట్‌కు , ఫ్యాన్‌కు కలిపి నేను ఇంత కరెంట్ బిల్లు ఎలా కట్టుకోవాలి. ప్రభుత్వం వెంటనే పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలి.

–రాయాకుల రవీంద్ర, ధర్మాజిగూడెం, లింగపాలెం మండలం

మాట మార్చిన కూటమి ప్రభుత్వం



ఎన్నికలకు ముందు తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచమని పదే పదే ఊదరగొట్టిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు సార్లు విద్యుత్ చార్జీలు పెంచి పేదలపై పెనుభారం మోపారు. చివరకు ఎస్సీ, ఎస్టీ ఇళ్లకు భారీగా విద్యుత్ బిల్లులు రావడంతో వారు బిల్లు చెల్లించలేని పరిస్థితిలో ఉన్నారు. అనేక చోట్ల మీటర్లను కూడా పీకేసి ప్రజలను చీకట్లో ఉంచిన పరిస్థితులు కూడా నెలకొన్నాయి.

–తెల్లం బాలరాజు, మాజీ ఎమ్మెల్యే, దుద్దుకూరు, బుట్టాయగూడెం మండలం

విద్యుత్ బిల్లులు భారీగా పెరిగాయి



గత రెండు నెలలుగా విద్యుత్ చార్జీలు భారీగా పెరిగాయి. గత నెలలో రూ.400 కడితే ఈ సారి బిల్లు రూ.600 పైగా వస్తుంది. రూ.200 అదనంగా పెరిగింది. అది నాకు భారమే. నేను విద్యుత్ వినియోగం కూడా తక్కువగానే చేస్తున్నాను. బిల్లు ఎందుకు పెరిగిందో అర్థం కావడం లేదు.

–మల్లి తాతారావు, విద్యుత్ వినియోగదారుడు, పోలవరం

తొళక్క వాహనంపై శ్రీవారి ఊరేగింపు

ద్వారకాతిరుమల: ధనుర్మాసోత్సవాలను పురస్కరించుకొని ఉభయ దేవేరులు, గోదాదేవితో శ్రీవారు గురువారం క్షేత్ర పురవీధుల్లో ఊరేగారు. ఈ వేడుక నేత్ర పర్వంగా సాగింది. ముందుగా ఆలయంలో స్వామి, అమ్మవార్లు, గోదాదేవి ఉత్సవ మూర్తులను తొళక్క వాహనంపై ఉంచి అర్చకులు విశేష పుష్పాలంకారాలు చేశారు. అనంతరం హారతులిచ్చారు. ఆ తరువాత మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, గజ సేవల నడుమ శ్రీవారి వాహనం ఆలయ ప్రధాన రాజగోపురం మీదుగా క్షేత్ర పురవీధులకు పయనమైంది. గ్రామోత్సవం అనంతరం ఆలయ ప్రధాన కూడలిలోని ధనుర్మాస మండపంలో స్వామి, అమ్మవార్లకు అర్చకులు విశేష పూజలు నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.



తొళక్క వాహనంపై ఉభయ దేవేరులు, గోదాదేవితో ఊరేగుతున్న శ్రీవారు

హామీలను అమలు చేయాలి

జంగారెడ్డిగూడెం: సమస్యల పరిష్కారానికి గతంలో 16 రోజులు సమ్మె చేసిన కారణంగా ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని మున్సిపల్ కార్మికులు డిమాండ్ చేశారు. జంగారెడ్డిగూడెం మున్సిపల్ కార్యాలయం వద్ద గురువారం కార్మికులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా అధ్యక్షుడు బి.బాలరాజు మాట్లాడుతూ గతంలో ప్రభుత్వం చర్చలు జరిపి హామీలను ఇచ్చిందని వాటిని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రధానంగా వేతనం రూ.21 వేలు ఇవ్వాలని, హెల్త్ అలివెన్సులు రూ.6 వేలు ఇవ్వాలని కోరారు. పారిశుద్ధ్య కార్మికుల అధ్యక్షుడు రేలంగి నాగరాజు, కార్యదర్శి గున్నే లక్ష్మణ్, వెంకటేశు, ప్రసాద్, పెంటయ్య, వేల్పుల రాజు, సత్యవతి పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహిస్తున్న కార్మికులు

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

బుట్టాయగూడెం: రామారావుపేట సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం మరమ్మతులు చేపట్టనున్నారు. ఈ మేరకు 27వ తేదీ ఉదయం పది నుంచి మధ్యాహ్నం పన్నెండున్నర గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.అహ్మద్‌ఖాన్ గురువారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు విద్యుత్ అధికారులకు సహకరించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా విద్యుత్ వినియోగదాలు ఈ విషయాన్ని గమనించాలన్నారు.

పారిజాతగిరి హుండీ లెక్కింపు

జంగారెడ్డిగూడెం: పారిజాతగిరి శ్రీవేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో ధనుర్మాసోత్సవాల్లో భాగంగా గురువారం వేకువ జామున తిరుప్పావై ప్రవచనం ఆలయ అర్చకులు నల్లూరి రవికుమార్ ఆచార్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటలకు హుండీ లెక్కింపుకు ధర్మాదాయ శాఖ ఏలూరు ఇన్‌స్పెక్టర్ వి.సురేష్‌కుమార్, ఆలయ కార్య నిర్వాహణాధికారి మానికల రాంబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. 90 రోజులకు గాను రూ.9,54,726 హుండీల ద్వారా ఆదాయం వచ్చినట్టు కార్య నిర్వహణ అధికారి తెలిపారు. ఈ హుండీ లెక్కింపులో ఏలూరు విజయవాడ రిటైర్డ్ ఎంప్లాయిస్ యూనియన్, కామయ్యపాలెం, పుట్లగట్లగూడెం సేవా సంఘం, ఇండియన్ బ్యాంకు అధికారులు, ఆలయ సిబ్బంది, అర్చకులు, అభివృద్ధి కమిటీ సభ్యులు దండు ధనరాజు పాల్గొన్నారు.



పారిజాతగిరిలో హుండీ లెక్కింపు నిర్వహిస్తున్న అధికారులు, అర్చకులు, ఆలయ సిబ్బంది

రైతులు సస్య రక్షణ చర్యలు పాటించాలి

కొయ్యలగూడెం: పొలం పిలుస్తోంది కార్యక్రమం గురువారం యర్రంపేట పంచాయతీ పరిధిలో నిర్వహించారు. మండల వ్యవసాయశాఖ అధికారి చెన్న కేశవులు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రైతులకు వర్జీనియా పొగాకు, మొక్కజొన్న, పంటలను పరిశీలించి రైతులకు సస్య రక్షణ చర్యలు తుఫాన్ నేపథ్యంలో తీసుకోవలసిన రక్షణ చర్యలు గురించి వివరించారు. యర్రంపేట, గంగన్నగూడెం గ్రామాల్లో పశు సంవర్ధకశాఖ అధికారులు, వ్యవసాయ సిబ్బందితో కలిసి వ్యవసాయ క్షేత్రాలను పశు పెంపకం కేంద్రాలను పరిశీలించారు.



కొయ్యలగూడెం: పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న వ్యవసాయ అధికారులు

వరి కోతలు వాయిదా వేసుకోవాలి

బుట్టాయగూడెం: ప్రస్తుతం వాతావరణంలో చోటు చేసుకున్న పరిస్థితుల నేపథ్యంలో వరి రైతులు కోతలను వాయిదా వేసుకోవాలని ఏఓ డి.ముత్యాలరావు తెలిపారు. మండలంలోని దొరమామిడి, లక్ష్మడుగూడెంలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుట్టాయగూడెం మండలంలో 3,561 ఎకరాల్లో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వరి పంటను రైతులు పండించారన్నారు. వీటిలో ఇప్పటివరకూ 2200 ఎకరాల్లో వరికోతల పనులు పూర్తయ్యాయని చెప్పారు. ఇంకా 1361 ఎకరాల్లో కోతలు కోయాల్సి ఉందన్నారు. ప్రస్తుతం వాతావరణ పరిస్థితుల దృష్ట్యా రైతులు రెండు రోజుల పాటు వరి కోతలు వాయిదా వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు మౌనిక, కుసుమ, రైతులు పాల్గొన్నారు.



బుట్టాయగూడెం: పొలం పిలుస్తోందిలో రైతులకు సూచనలు ఇస్తున్న ఏఓ ముత్యాలరావు

సంక్రాంతికి రహదారుల నిర్మాణం పూర్తి చేస్తాం

కామవరపుకోట: జిల్లాలో పల్లె పండుగ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో మొదట విడతగా 983 సీసీ రోడ్ల నిర్మాణానికి 92.02 కోట్లు మంజూరైనట్లు, వాటి నిర్మాణాన్ని సంక్రాంతి కల్లా పూర్తి చేస్తామని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. గురువారం కామవరపుకోటలో రూ.70 లక్షలతో, రోడ్లను కలెక్టర్, ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో చింతలపూడి మాజీ శాసనసభ్యులు ఘంటా మురళి రామకృష్ణ, నూజివీడు సబ్ కలెక్టర్ బి.స్మరణ్ రాజ్, జంగారెడ్డిగూడెం ఆర్డీవో ఎంవీ రమణ, పంచాయతీ రాజ్ ఎస్సీ రమణమూర్తి, డ్వామా పీడీ సుబ్బారావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ త్రినాథ బాబు, తహసీల్దార్ జి.ఎలీషా, ఎంపీడీవో సరళ కుమారి, సర్పంచులు, ప్రజా ప్రతినిధులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి, ఎమ్మెల్యే సొంగ రోషన్

రంజన్ మిశ్రా పర్యటనను విజయవంతం చేయండి

జంగారెడ్డిగూడెం: ఈ నెల 27వ తేదీ ఏలూరులో జరిగే రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ పర్యటనను విజయవంతం చేయాలని ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ రాష్ట్ర నేత, పోలవరం నియోజకవర్గ పరిశీలకుడు విస్సంపల్లి సిద్దు మాదిగ పిలుపునిచ్చారు. మండలంలోని దేవులపల్లి గ్రామంలో మహాజన సోషలిస్టు పార్టీ మండల నాయకులు తుట్టి ఈశ్వర్ దొర అధ్యక్షతన గురువారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్దు మాట్లాడుతూ శుక్రవారం ఉదయం పది గంటలకు ఎస్సీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన జస్టిస్ రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ ఏలూరు కలెక్టరేట్‌కు చేరుకోబోతుందని తెలిపారు. కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం పట్టణ కన్వీనర్ బొడ్డపాటి పండు, జంగారెడ్డిగూడెం మండలం ఉపాధ్యక్షుడు కొలుకులూరి రవి, చెప్పుల మార్తమ్మ, రమేష్, సుధాకర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న సిద్దూమాదిగ

వంగవీటి అడుగుజాడల్లో నడవాలి



చింతలపూడి: రంగా విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాపు సంఘం నేతలు



కొయ్యలగూడెం: రంగా విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

చింతలపూడి: వంగవీటి రంగా అడుగుజాడల్లో నడవాలని పలువురు పిలుపునిచ్చారు. స్వర్గీయ వంగవీటి మోహన రంగా వర్ధంతిని గురువారం నిర్వహించారు. పాత బస్టాండ్ సెంటర్‌లో ఉన్న రంగా విగ్రహానికి కాపు సంఘం నాయకులు, పలు రాజకీయ, ప్రజా సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రంగా విగ్రహ నిర్మాణ అభివృద్ధి కమిటీ గౌరవ అధ్యక్షుడు కె.శేషగిరిరావు, అధ్యక్షుడు తోట శివనాగరాజు, కార్యదర్శి కార్యదర్శి ముత్యాల శ్రీను (చిన్ని), ట్రెజరర్ రాఘవేంద్రరావు, పట్టణ అధక్షుడు తూము విజయ్‌కుమార్, జిల్లా కాపు సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు.

రంగా ఆశయాలు స్ఫూర్తిదాయకం

కొయ్యలగూడెం: స్వర్గీయ వంగవీటి మోహనరంగా ఆశయాలు నేటి రాజకీయ వాదులకు స్ఫూర్తిదాయకమని కాపు నాయకులు చోడిపిండి సుబ్రహ్మణ్యం, మంచాల వెంకయ్య నాయుడులు పేర్కొన్నారు. గురువారం రంగా 36వ వర్ధంతి కార్యక్రమం మెయిన్ రంగా విగ్రహం వద్ద సుబ్రహ్మణ్యం, వెంకయ్యనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులతో జోహార్లు అర్పించారు. సర్పంచ్ ముప్పిడి విజయ కుమారి, జేష్ట రామకృష్ణ, మట్ట సత్తిపండు, ముప్పనాపల్లి వెంకటేశ్వరరావు, నూకల రాము, మట్ట శ్రీను, గొలిశెట్టి శ్రీను, దారం సత్తిరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీపీఐ వ్యవస్థాపక దినోత్సవం

వేలేరుపాడు: భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను మండలంలో పార్టీ మండల సమితి గురువారం ఘనంగా నిర్వహించింది. వేలేరుపాడు ప్రధాన కేంద్రం వద్ద సుమారు 150 బైకులతో ర్యాలీ నిర్వహించారు.

బుట్టాయగూడెం: స్థానిక సీపీఐ కార్యాలయం వద్ద గురువారం సీపీఐ శత జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. నాయకులు తెల్లం మునీశ్వరరావు, మడకం ప్రదీప్, దుర్గారావు, పండయ్య, సూర్యచంద్రం పాల్గొన్నారు.

చింతలపూడి: దేశంలో కార్పొరేట్ శక్తులే బీజేపీ ప్రభుత్వాన్ని నడిపిస్తున్నాయని సీపీఐ మాజీ జిల్లా కార్యదర్శి మామిళ్లపల్లి వసంతరావు ధ్వజమెత్తారు. సీపీఐ మండల కార్యదర్శి కె.గురవయ్య, సహాయ కార్యదర్శి టి.బాబు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం: భూమికోసం, భుక్తి కోసం, శ్రమ జీవుల విముక్తి కోసం పోరాటాలు చేసిన పార్టీ సీపీఐ అని కొయ్యలగూడెం మండల సీపీఐ పార్టీ సహాయ కార్యదర్శి తాడిగడప అంజనేయరాజు పేర్కొన్నారు. బొబ్బర యేసు, వెలగల రామారావు, ముప్పిడి గంగాధర్, గోపాలం పాల్గొన్నారు.

కుక్కునూరు: భారత కమ్యూనిస్ట్ పార్టీ సీపీఐ నూరేళ్ల వసంతోత్సవాలు పురస్కరించుకొని గురువారం సీపీఐ మండల సమితి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు భారీ ప్రదర్శన నిర్వహించారు. మైసాక్షి వెంకటాచారి, కొన్నె లక్ష్మయ్య పాల్గొన్నారు.

పోలవరం రూరల్: కార్మికులు కర్షకులు పేదల తరఫున సీపీఐ నిరంతరం పోరాడుతుందని పోలవరం మండల కార్యదర్శి జల్లేపల్లి వెంకట నరసింహారావు(జేవీ) అన్నారు.



సీపీఐ జెండాను ఎగుర వేస్తున్న నాయకులు

భూ సమస్యల పరిష్కారానికి కృషి

భీమడోలు: భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందని మండల ప్రత్యేకాధికారి ఆర్‌వీ నాగరాణి అన్నారు. పోలసానిపల్లి గ్రామంలో గురువారం సర్పంచ్ షేక్ రహీమాబేగం అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాణి మాట్లాడుతూ సమస్యలపై 8 అర్జీలు వచ్చాయని, వీటిని గడువు తేదీలోగా పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.రమాదేవి, ఆర్ఐ కిరణకుమారి, సర్వేయర్ ధర్మారావు, గ్రామ కార్యదర్శి యు.జయరామకృష్ణ, వీఆర్వో సాల్మన్, తదితరులు పాల్గొన్నారు.

వెల్లమిల్లిలో ఐదు అర్జీలు

ఉంగుటూరు: వెల్లమిల్లి గ్రామంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో వివిధ సమస్యలపై ఐదు అర్జీలు వచ్చినట్టు తహసీల్దార్ పూర్ణచంద్ర ప్రసాదు తెలిపారు. సర్పంచ్ కుమార్ రాజా, వీఆర్‌ఓలు పాల్గొన్నారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు బొమ్మిడి పంచాయతీ కార్యాలయం వద్ద రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ పూర్ణచంద్ర ప్రసాదు తెలిపారు.